"శిష్టసాహిత్యంలో జానపద ముద్ర"

"ఆకాశభారతి"

ఆచార్య తూమాటి దొణప్ప

ద్వానా శాస్త్రిగారు ఆచార్య తూమాటి దొణప్ప గారి ప్రియ శిష్యుడు. దొణప్పగారి వంటి విజ్ఞాన ఖని వద్ద శిష్యరికం చేసే అవకాశం దొరికినందుకు తన అదృష్టాన్ని ఎల్లప్పుడూ తలుచుకుంటూ ఉంటారు. దొణప్ప గారి వద్ద తన విద్య ఆర్తిని తీర్చుకున్నాను అని, విద్యార్థి జీవితాన్ని సఫలం చేసుకున్నాను అని మనఃపూర్వకంగా చెపుతారు. తన గురువుగారు వ్రాసిన "ఆకాశభారతి" అనే రచనలోనుంచి "శిష్టసాహిత్యంలో జానపద ముద్ర" అనే వ్యాసాన్ని మీతో పంచుకోమని నాకు అందించిన వారికి ధన్యవాదాలతో

శిష్టసాహిత్యంలో జానపద ముద్ర

జనావాసాలలో పల్లెటూళ్ళు ఒక భాగం, పట్టణాలూ, పురాలూ, నగరాలూ ఒక భాగం. పల్లెటూళ్ళనే జనపదాలని అంటారు. జనపదాలలో నివసించేవారిని స్థూలంగా జానపదులని వ్యవహరిస్తారు. తక్కినవారిని పౌరులు, నాగరులు అని అంటారు. పౌర జానపదులన్న విభాగం అతి ప్రాచీనకాలం నుంచీ ఉన్నట్లు సంస్కృతాంధ్ర సాహిత్యాధారాల వల్ల స్పష్టపడుతున్నది. కాని, నాగరిక గంధం అంటనివారినీ, చదువుసంధ్యలు అబ్బనివారినీ, కృషిపాలనం, గోపాలనం, తత్సంబంధి వృత్తులు ముఖ్యజీవికగా మనుగడసాగించే మామూలు మనుషులను జానపదులని ప్రాయికంగా పరిభాషించడం కద్దు. కాని, అది వాస్తవిక సత్యం. పురాలలో, నగరాలలో నివసించేవారంతా పదవ్యుత్పత్తి రీత్యా పౌరులూ, నాగరులూ కావచ్చుగాని, అట్టడుగు - బడుగు తెగలకు చెందిన అసంఖ్యాక జనంతో పాటు జానపద స్వభావమైన పై వర్గాలవారు పరిగణించదగ్గ సంఖ్యలో అట నివసిస్తుంటారు. అందుచేత నివాస కారణాన్ని పక్కకు పెట్టి, వీరిని సైతం జానపదుల లెక్కకు జమకట్టడం సమంజసం.

'జనపదాత్ ఆగతః అథవా జనపదే భవః జానపద'మ్మని శిష్ట శాబ్దికుల తీర్పు. విశేష సంస్కారం లేనిదీ, నిసర్గ మధురమైనదీ జానపదమని స్థూలంగా చెప్పుకోవచ్చు. జనపదాలకూ, జానపద స్వభావులకూ సంబంధించిన సమస్త భౌతికా భౌతిక సంస్కృతిని జానపద విజ్ఞానం అనవచ్చు. అంటే వీరి అభిరుచులూ, అలవాట్లూ, ఆటపాటలూ, ఆచారాలూ, ఆలోచనలూ, కట్టూబొట్టూ, నగానట్రా, తిండీతిప్పలూ, తిట్లూఒట్లూ,

నమ్మకాలూ, తరాల తరబడిగా చెప్పుకునే కట్టుకథలూ, కాకమ్మకథలూ, పేదరాసి పెద్దమ్మ కథలూ, పరిహాస ప్రసంగాలూ, మోటు సరసాలూ, ఉత్సవాంగాలుగానో, ఉత్సాహాంశాలుగానో పాడుకునే పాటలూ, వీరగాథలు, గాథా చక్రాలూ, దేశాంతరవాళ్ళ పండగపబ్బాలూ, వంటావార్పులూ, చేతి పనులూ, పనిముట్లూ గోసాయి చిట్కాలు సంచికట్టు నాటువైద్యమూ, చేతబడులూ, మారణ మోహన మోచనాది మంత్రతంత్రాలూ, పలుకుబళ్ళు, సామెతలూ, పొడుపుకథలూ మొదలైన వాటిని జానపదవిజ్ఞాన భాగాలుగా పేర్కొనవచ్చు ఈ జానపద ముద్ర తెలుగులోని శిష్టసాహిత్యంపై ఎంత వరకు అచ్చొత్తిందీ అని వివేచించడం ప్రస్తుత వ్యాసంగానికి ప్రయోజనం

తెలుగు శిష్టసాహిత్యం దొరికినంతవరకూ ఇంచుమించు వెయ్యేళ్ళ చరిత్ర కలది సంస్కృతంలోని తాత్త్విక ధార్మిక గాథా చక్రమైన పురాణేతిహాస కావ్యపరంపర ప్రాముఖ్యంగా తెలుగు సాహిత్యానికి తొలి బంధవాలం ఇహలోక విషయాలకంటె పరలోక విషయాలు ఆర్ష సంస్కృతి ప్రియులైన సంస్కృతీయులకు పరమార్థంగా ఉన్నట్లు కనిపిస్తుంది ఆ వాఙ్మయ సృష్టి ప్రయోజనం జగద్ధితమనీ, విశ్వశ్రేయమనీ, సకల జన కల్యాణదాయకమనీ పదేపదే ప్రతిజ్ఞా వచనలుగా ప్రకటిస్తున్నప్పటికీ అందులో సామాజికదృష్టి. సామాన్యజన జీవనస్పృష్టి చాల తక్కువనడంలో తప్పులేదు తాత్త్విక చింతనల పేర, ధార్మిక బోధనల పేర సంస్కృత వాఙ్మయం చాలా భాగం సంతరించబడ్డది మరి, ఈ వాఙ్మయానికి అనుకరణంగానో, అనుసరణంగానో వెయ్యేళ్ళుగా మూర్తి నందిన తెలుగు సాహిత్యం దానికన్న భిన్నమైన మూసలో రూపు పట్టిందని గట్టిగా చెప్పలేం

ఆశ్రయదాతల అభిరుచినిబట్టి, పండితపరిషత్తుల ప్రాపకాన్నిబట్టి, ఆలంకారికుల అనుశాసనాన్నిబట్టి, విద్వత్కవుల ఆదరణనుబట్టి, ఆ వ్యా

కవులు స్వీకరించిన కథావస్తువుల స్వభావాన్నిబట్టి తెలుగుసాహిత్యం రూపొంది పెంపొందింది. కథావస్తువులందామా అధికభాగం లాక్షణికులు గిరగీసి నిర్దేశించిన నమూనా మూసంలో పోతపోసినవి. స్వీయాధీనా వాసకసజ్జికాది అష్టవిధనాయికల, ధీరోదాత్తాది చతుర్విధనాయకులచుట్టూ గుడుగుడుగుంచంగా అల్లబడ్డ రచనలే తెలుగులో కోకొల్లలుగా గోచరిస్తాయి. ఇలాంటి ఇరకాటపు చట్రాలలో బిగించబడ్డ మూసపోత సాహిత్యంలో జానపదుల ఆచ్ఛాదనమైన జీవితచ్ఛాయలెలా కనిపిస్తాయి? అవతార పురుషులనూ, అలౌకిక వ్యక్తులనూ ఆలవాలమైన ఐతిహాసిక ప్రపంచంలో, అందం, ఆభిజాత్యం, ఐశ్వర్యం, ఔదార్యం, ఔద్ధత్యం మహోదాత్త గుణాలుగా రూపెత్తిన నాయికా నాయకులు విహరించే పురాణ పురాలలో, ఉత్తమ ప్రకృతులుగల ఇతివృత్తమే కథావస్తువుగాగల కావ్య వాటికలలో, పడికట్టు సూత్రాల పరిధిలో సూత్రబద్ధిన ప్రబంధవీధులలో, సంస్కృతాలైన రూపక సౌధాలలో నాటుదినుసు మోటు మనసు సగటుమనిషి ప్రవేశించలేడు సరికదా అతని రంగప్రవేశానికి అనువైన సన్నివేశాలు ఆంధ్రసాహిత్యంలో అస్తి నాస్తి విచికిత్సా హేతువులు, ఆ ఉన్నచోట సైతం దృశ్యాదృశ్యంగానో, రేఖామాత్రంగానో, నామమాత్రంగానో తప్ప జానపదుని స్పష్టమూర్తి మనకు సాక్షాత్కరించదు ఇక, అతని విరాణ్మూర్తి దర్శనం కలలోని మాట. అయితే స్వస్థాన వేషభాషా ప్రియులైన కొద్దిమంది తెలుగు కవుల రచనలలో చెదురు మదురుగా కనిపించే పట్టులను చూపించి, ఆ పట్ల జానపద ప్రభావం ఎంతవరకు ముద్రితమయిందో అవలోకిద్దాం

సహస్రాబ్దులుగా సాగిన, తెలుగు సాహిత్యంలో కథావస్తువు, సన్నివేశాలు, పాత్రపోషణ, ఛందస్సు, భాష మున్నగు వాటి దృష్టిలో జానపదముద్రను పరికించి విశ్లేషించవలసి వుంది. తెలుగు సాహిత్యంలోని కథావస్తు సంచయం చాలమట్టుకు గీర్వాణభూమినుంచి దిగుమతి చేసుకున్న

సరుకని ఇదివరకే అనుకున్నాం 'సీతారాముల పెండ్లిపేరటములున్ శ్రీకృష్ణరాధారతుల్-త్రేతాద్వాపర యజ్ఞకర్మలువినా లేవో కథావస్తువుల్ ' అని ఒక యుగకవి నిలదీసి సంజాయిషీ అడుగుతున్నాడు 'ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు' అని కర్తవ్యాన్ని సూచిస్తున్నాడు మరో మహాకవి

ఆయితే నిర్దేశించిన సంస్కృత వాఙ్మయ పరిధులను దాటిన సందర్భాలు లేనే లేవనికాదు తెలుగుసీమలో రెళ్ళారోకళ్ళా జనప్రియాలుగా విశేషప్రచారంలో ఉన్న దేశీయ కథావస్తువులను స్వీకరించి అచ్చపు దేశి సరకులు నింపిన తెలుగు కవులు వేళ్ళమీదికి చాలరు

జానపద స్వభావులైన జనులలో పసిపిల్లల మనస్తత్వం ప్రసిద్ధ గుణమేకాక, ప్రకృతిసిద్ధగుణం కూడ క్షణక్షణ పరివృత్తి చిన్న పిల్లల చిత్తవృత్తి దేనిమీదా దాని ప్రవృత్తికి నిలకడ ఉండదు. పొద్దస్తమానూ ఒకే ఆట ఒకే పాట వారికి ఒక పట్టాన నచ్చవు ఆడిన ఆటే, పాడిన పాటే అయితే వారికి మొగం మొత్తుతుంది అందుకని అనుక్షణం మార్చుకోవాలి ఆకస్మిక పరిణామాలూ, హఠాత్సంభవాలూ అంటే పిల్లలకమితప్రీతి సాధ్యాసాధ్యాలను గూర్చి వారు చర్చించరు సంభవాసంభవాలను గూర్చి అసలే ఆలోచించరు. భావనతప్ప, చింతన వారికి సుతారమూ సరిపడని సంగతి అవికల్పితమో జల్పితమో వారికి పట్టదు వారు కళ్ళారా చూచేదిగాని, చెవులారా వినేదిగానీ అద్భుతంగా ఉండాలి, అభినవంగా ఉండాలి అంతే! అలా అంటేనే వారికి సంతోషం, అలా ఉంటేనే వారికి సంతృప్తి పరశువుడు కావచ్చు, పరమశివుడు కావచ్చు, ఆలోచనలలో, ఆచరణలో జానపదుల అంతస్తుకు దిగిరాకతప్పదు బాలచంద్రుడైనా, భాలచంద్రుడైనా వీరితో కూడి మాడి కోలాటం వెయ్యవలసిందే, కోతికొమ్మచ్చి ఆడవలసిందే రామభద్రుడన్నా, వీరభద్రుడన్నా

వీరికి వియ్యంకులుగానో, వేలువిడిచిన మేనమామలుగానో, మారక తీరదు చిత్రాంగికాని, సీతమ్మవారుగాని వీరికి ఇరుగమ్మా పొరుగమ్మల కిందలెక్క. అచ్చంగా ఇలాటి శిష్ట మనస్తత్వంగల జానపదులను అత్యుక్తులూ, అతిశయోక్తులూ అలరించినట్లుగా సహజోక్తులూ, స్వభావోక్తులూ సంబరపెట్టలేవు. అతీంద్రియశక్తులను వెలార్చే పట్టులూ, అతిలోక వ్యక్తులను పరిచయంచేసే ఘట్టాలూ, అంటే జానపదులు చెవికోసుకుంటారు. ఈ తరహా సగటు జనాన్ని ఊహించడానికీ, షికార్ చెయ్యడానికి తెరనాటకపు రంగాలూ, పగటివేషగాళ్ళూ, పౌరాణికులూ, బయలాట భాగవతులూ, బొమ్మలాటగాళ్ళూ, విప్రవినోదులూ, వీరముష్టులూ, హరికథకులూ తదితర జానపద కళాప్రయోక్తలూ సతతా యత్నిస్తూనే ఉంటారు. ఇలాటి జానపద బాహ్యలే కథావస్తు పరంగా మనకు శిష్టసాహిత్యంలో చెదురుమదురుగా ఎదురవుతాయి.

తెలుగునాట మత సాంఘిక రాజకీయాదిరంగాలలో ప్రముఖపాత్ర చరితార్థుల చరితలు కొన్ని కావ్యాలకు ఆలంబనంగా కనిపిస్తాయి. మల్లికార్జున పండితారాధ్యుల గాథలనూ, బోధనలనూ ప్రచారపరిచే పండితారాధ్య చరిత్ర, పల్నాటి పౌరుషగాథలకు నిలువుటద్దం నిలిపిన పల్నాటి వీర చరిత్ర, పుల్లరి చెల్లింపు తగాదాలు బీజంగా మహావటరూపాన విస్తరించి దోనకొండ యాదవరాజుల వీరగాథాచక్రాన్ని విస్తతపరిచే కాటమరాజు కథ, బుర్రకథా (తందాన కథ) రూపంలో తెలుగుగడ్డను పోతుగడ్డగా తీర్చిన బొబ్బిలి వెలమవీరుల విక్రమక్రమాలను వివరించే రంగరాయచరిత్ర-మున్నగు వాటిని కొన్నింటిని ఉదాహరణలుగా ఉద్ధరించవచ్చు. ఇక గాథలకూ, స్థలపురాణాలకూ అలౌకికతను ఆపాదించే అనేక క్షేత్ర మాహాత్మ్య రచనలకు జానపదుల నమ్మకాలూ, వారిచే కొలుపులందిన గ్రామ దేవతల గాథావళి మూలమూర్తులు. వాల్మీకేతర ఘట్టాలతో రూపుకట్టిన మైరావణ చరిత్ర, శతకంఠ సహస్రకంఠ రామాయణాలూ, రంగనాథ రామాయ

ణంలో అవాల్మీకాలైన కాలనేమికథా, సులోచనావృత్తాంతమూ, మొదలైన అద్భుతాపాది భాగాలూ, వైయాసిక విపరీతంగా రూపితమైన చిత్ర భారతమూ, జైమిని భారత ఘట్టాలూ జానపద ప్రభావానికి మచ్చుతునకలు శుకసప్తతి, హంసవింశతి మున్నగు కథాకావ్యాలలోని కథలు తెలుగునాట నలుచెరగులా వినిపించే పేదరాసి పెద్దమ్మకథలకు కావ్యరూపాలు

తెలుగునాటికి ఇరుగుపొరుగు సీమలైన తమిళ కన్నడ మరాఠ్వాడా ప్రాంతాలలోని జనుల నాల్కలపై చిందులవిందులు చేసే అనేక కథావస్తువులనుకూడా తెలుగు కవులు కొందరు స్వీకరించారు బసవపురాణం, పండితారాధ్యచరిత్రలలోని ఉడుమూరి కన్నప్ప, బెజ్జ మహాదేవి, మడివేలు మాచయ్య ప్రభృతి ముగ్ధభక్తుల చరిత్రలూ, నవనాథచరిత్రలో చిత్రితాలైన నాథసంప్రదాయ యోగుల మహిమాన్వితగాథలూ, పరమయోగి విలాసంలోని వైష్ణవ భక్తుల కథలూ, ఆముక్తమాల్యదలోని గోదా కథ, ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యంలోని మధురాపురీ వారకాంతల ఉదంతం వంటివి ఈ కోవకు చెందినవి

ఇలా, సంపూర్ణకథా శరీరాలుగా మాత్రమేకాక, కథావస్తువులలోని కొన్ని మనోహర ఘట్టాలలోనూ జానపదముద్ర స్పష్టంగా కనిపిస్తుంది 'వల్లియలు వైచి యోదమున్ పెల్లుద్రవ్వి తాల్చి వేసఱియురులొగ్గి వట్టి దయ్యం-దోలి యొంటరిపోనీక దొడ్డివాగి పొదుగ నొడుపున నలదెస పాంచి యాడి (పూ 6-191) అన్నపద్యం గోపాలవృత్తికి సంబంధించినదిగా ఎఱ్ఱయ హరివంశంలో మనకు కనిపిస్తుంది శ్రీనాథుని శృంగారనైషధం దమయంతి పెళ్ళిలో బువ్వంబంతి సమయపు పరిహాసోక్తులు తెలుగునాటి వియ్యాలవారి సరసాలకు అక్షరరూపాలు 'గోపటింశకులు చలిదికావడులు మూపులవహించి సజ్జంబులగు కజ్జంబులు గట్టికొని పదత్రాణ వేత్రదండ ధరులై తెక్కలికు వెక్కసంబైన తమతమ శ్రేష్ఠ కదుపులం జనుదెంచి

రొప్పుకొనుచు గానవంబు సొచ్చి కొమ్ము లిమ్ముగ బూరించుచు, వేణువు
లూదుచు నదీజలంబుల దోగుచు దీవయుయ్యేలల నూగుచు ' బృందా
వనిలో విహరించినట్లు పోతన్న వర్ణనం పశుపాలన లాలనాది రీతులు
పోతన భాగవతం (10-119గ) లో సహజసుందరంగా రూపించబడ్డాయి
'గూనిపిపులదుర గొణగిట్టుచు నేకు గఱచినట్టి కుక్క గడ్డనంగ మూతి
నరప మీసముల టోయముడుకళ్ళ (4.98) మనుచరిత్రలో స్వరోచివేట
సంవత్సరంలో వలలా తాళ్ళుమోస్తూ మనకు కనిపిస్తారు 'పెన్నుసురున
మేదెరువుం గుంపటిమంచమెక్కి, కట్టాకెక్కుట్టారు గోగిరషుల్ మెక్కి .
పిసికిళ్ళం బిసికిళ్ళ ' అమితానందం పొందిన కృషిపాలకులు పల్లెటూరి
రెడ్ల అనుభవాలు (4-133,134) ఆముక్తమాల్యదవల్ల మనకు తెలుస్తాయి
' అటవికపుట భేదనంబునం గాడిచేసి జాతరకుం జాటం బనుప
మణుపటి మ గళవారంబున కీచక తండులంబులం బిండికొట్టి కొ్రటదోసి
యుప్పిగొప్పెలుగా జేసి యూవించిన కుడుములు జానలు పిండికూరల
చట్లును వెంళ్ళను అజీరలు గంపల గావిళ్ళనుబెట్టి బండికట్టుకొని
కాంద్రేవిగుడికి (కాళ 3-86) ఆటవికులు నడచిన తీరును పూర్తటి
కళ్ళకుగట్టినట్టు కాపించిన వర్ణనం మనోజ్ఞమధురం 'మందెల మీద నెక్కి
కటిమండలి జుట్టిన పాటుటాకు లింపించుక సంచలింప పిట్టలన్ '
ఒడిసెళ్ళతో తోలె చెంచెతల చిత్రభంగిమలందలి ఆటవికుల కాపుదనం
కాళహస్తిమాహాత్మ్యంలో అక్షరాకృతి నెత్తింది గాలిగంగల జాతర
సందర్భంగా 'ఎద్దెకనప్ప గ్రైసేతల పురస్సరద్భాగ్యంగా శక్తిగుడికి
విచ్చేసిన రద్దుల నడకల చిత్రణంలోని సొగసులు (3-75) పాండురంగ
విభునిపైగల జానపదప్రభావానికి చక్కటి నిదర్శనం గోకులం నుంచి
బృందావనానికి తరలివెళ్ళే సమయంలోని గోపీగోపకుల సంరంభాన్ని
వెన్నెలవంటి సూరన తన విష్ణుపురాణం (7-134)లో చిత్రించిన తైన:
గోపాలనలాలనవృత్తికి అద్దంపట్టిన అనువర్ణనం ఊహాన్వోక కిరాతాంగన

కుదురగ జంగసాచి పొలుటాకుపయ్యెద పొదలంగ చందనపు జోలన నేనుగు కొమ్ము రోకటన్ బ్రిదిలెడు కొప్పుతో వెదురు బియ్యము గువ్వ ' (2-115) దృశ్యం వాల్మీకి చరిత్రకర్త రఘునాథరాయల ఆటవిక జీవన చిత్రణానికి ఒక తార్కాణం

తెలుగునాట ఆటపాటలు అన్నివర్గాల జనులలోను కనిపిస్తాయి కాని, నాగరుల క్రీడావినోదాలు వేరు, జానపదుల ఆటపాటలు వేరు కొన్ని ఉభయులకూ చెందినవి కావచ్చు శ్రీనాథుని భీమేశ్వరపురాణంలో శివుడు బ్రహ్మవిష్ణులతో ' ఆంధ్రక్షమాస్థలికిం బోదమె యాసుపోకకు వినోదంబుల్ పరీక్షింపగన్' అన్నట్లు చెప్పడంవల్ల తెలుగుదేశంలో ఆసు పోకకు ఆడే వినోదక్రీడలు శ్రీనాథుని కాలంనాటికే లెక్కకు మిక్కిలిగా ఉన్నట్లు ఊహించవచ్చు నన్నయాదులు పేర్కొన్న కందుకక్రీడ జనపదాలకే పరిమితమని చెప్పలేం నన్నెచోడుడు పార్వతి శైశవ క్రీడా వినోదాలలోను, పోతన్న రుక్మిణీకల్యాణ కథాభాగంలోను పేర్కొన్న బొమ్మలపెళ్ళి జానపదులలోనూ ప్రచురం పాల్కురికి సోమన, ఎఱ్ఱయ్య నాచన సోమన, అనంతామాత్యుడు, మున్నగుకవులు ఉదాహరించిన ఎన్నో ఆటపాటలు పల్లెసీమలో ప్రసిద్ధమైనవి బలరామకృష్ణులు పెన్ను ఇతర గోపబాలకులు చిఱుద్దులై ఆడిన ఆటలనేకం పోతన్న కళ్ళకు గ నట్లు వర్ణించాడు ఉప్పునబట్టెలు, కోతికొమ్మచ్చి, కోడిపందాలు, చెరకు పందాలు, దాగుడుమూతలు, నాలుగుకంబాలాట, పొట్టేళ్ళ యుద్ధాలు మొద లైనవి నాటికీ నేటికీ పల్లెటూరి వారికి కొట్టినపిండి అచ్చనగండ్లు, ఓమన గుంటలు, గీరనగింజలు, వెన్నెలకుప్పలు మున్నగునవి తెలుగు ఆడబిడ్డల ఆటపాటలలో ప్రచురమైనవి అయ్యలరాజు నారాయణయ్య హంసవింశ తిలో నూటికిపైగా తెలుగువారి ఆటపాటలు ఒక సీసమాలికలో పట్టికా రూపాన ఉట్టంకించబడ్డాయి విశ్వనాథ వారి 'ఆంధ్రావళి'లో చెడుగుడు, గోడీబిళ్ళ, చెట్టాట, కోతికొమ్మచ్చి మున్నగు జానపదుల క్రీడా విశేషాలు తెలుగుబిడ్డలకు వెన్నతోపెట్టిన విద్యలుగా చిత్రించబడ్డాయి

తెలుగుసాహిత్యంలో సంచికట్టు వైద్యం గూర్చిన ప్రసక్తి అడపా దడపా వచ్చింది 'మగువయొనర్చు వశ్యవిధిమందులు మాకులు నొందు చందమై మగనికి వెచ్చు రోగములు ' (అరణ్య 4-288) అని సత్యా ద్రౌపదీ సంవాదంలో సూచించబడింది క్రీడాభిరామంలో ఎలివాడ వనిత అమ్మిన నాటుమందును గూర్చి గోవిందమంచనశర్మ అభివర్ణించిన వైనం ప్రసిద్ధం ముక్కంటి కంటికి జబ్బుచేసినపుడు తిన్నడు జానపదులు చేసే చికిత్సారీతులు ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యంలో నిరూపించబడ్డాయి. 'కోకపొల్లం బావిగోనసూడి ఒత్తడం, తంగేడాకు మెత్తడం, పిరినేయి పెట్టడం, పెరుగుపత్తులు వెయ్యడం, ఇంకా ఏన్ను మందులు, కన్ను మందులు, అడవిమందులు, అడిగి తెచ్చిన మందులు వాడడం' శివుని కంటికి తిన్నడుచేసిన చికిత్సలుగా పేర్కొబడ్డాయి 'చిత్రాంగి మందులు నీకుం దలకెక్కె' (3-53) నని రత్నాంగి తన భర్తను దెప్పిపొడుస్తుంది

ఏలలు, గొడుగీతాలు, గౌరీ కల్యాణాలు, చందమామ పదాలు, తుమ్మెదపాటలు, ధవళాలు, వెన్నెలపాటలు, సువ్వాలలు, శోభనాలు మొదలుగా శిష్టసాహితిలో ఉట్టంకించబడ్డ గీతికాతతి జానపద కళాభారతి కెత్తిన మంగళహారతి పండితారాధ్య చరిత్రలో అనేక జానపద కళాప్రదర్శనల తీరతీయాలు వివరించబడ్డాయి

'సకల పురాతన చాటుగీతములు
ప్రకటించి ప్రకటించి పాడెడువారు
వేడుకతో చిందులాడంగ నుబ్బి
కోడంగి యాటల గునిసెడు వారు
భారతాదికథల జీరమువుంగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడునద్భుతంబుగ గంట సూత్రంబు
లదరంగ బొమ్మలనాడించువారు ' పర్వత ప్రకరణంలో మనకు దర్శనమిస్తారు

భావవాహకాలుగా, కావ్యబహిఃస్వరూప నిరూపకాలుగా శాసన కవులతోపాటు నన్నయ మొదలుగా తెలుగు కవులు వాడిన ఛందస్సులలో జానపదముద్రకలు ద్విపద, తరువోజ, మధ్యాక్కర, రగడ మున్నగు దేశీయచ్ఛందాలు ప్రసిద్ధమైనవి

మడికట్టుకున్న లాక్షణికులు ఎంతనెత్తిన నోరు పెట్టుకుని గోల చేసినప్పటికీ జన పథాలలో పుట్టిపెరిగిన కవులూ, జానపదుల మధురమయ ఫణితిపై మోజుపెంచుకుని ఆ బాణీలో తమ వాణిని కైసేసిన కవులూ అనేక మాండలిక పదాలకూ, ప్రయోగవక్రోక్తులకూ తమ రచనలలో స్థానం కల్పించారు సంస్కృత భూయిష్ఠ రచనారీతిని తిరస్కరించి జానపదంవైపు మొగ్గుచూపే జానుతెనుగు కూర్పు తీర్పులు పురస్కరించిన సోమనాథుడు మనకు ప్రాతఃస్మరణీయుడు పాతవద్ద మాటలను కాదని నెల్లూరుమండల జానపదుల నెరజాణతనం నిలువెల్లా నింపుకున్న మాండలిక పదాలను ప్రయోగించిన తిక్కన్న ముందుగా మనకు అభినందనీయుడు సూరన, వేమన, కందుకూరి రుద్రయ, చేమకూర వెంకన్న, శేషం వెంకటపతి, వెలిదెండ్ల వెంకటపతి, సముఖము వెంకటకృష్ణప్ప, యడవల్లి వెంకటకవి మున్నగు కవుల రచనలలో తెలుగుదేశీతనం పుష్కలించే నూరారు నుడికారాలు, సామెతలు మనకు కనిపిస్తాయి అడిగేవారు, ఏదుంటివీసరి పొద్దుదనుక, ఏమి చూచేవని, ఒదయనేటేటి సీమాట, గుడి మింగే వానికిన్, చర్చసేయగబోతే, చేసిందేటివి, నుయిదాటేవానికిన్, నేద్రబోవుదాకా నిద్రబోవదు, పొరుగిదలి పొంబ్యాని, మొక్కేవు సామి, వచ్చేనన్నాడా - వంటి కావ్యప్రయోగాలు భాషాపరంగా జానపద ప్రభావానికి మంచి ఉద్ధరణలు జానపదుల భాషా, భావాలూ ఒకదానితో ఒకటి పోటాపోటీలు పడగా అచ్చమైన పామరుల మాండలిక పదాల కూర్పుతో రూపెత్తిన చంద్రశేఖర శతకం తెలుగు శతక వాఙ్మయ సర్వస్వంలో నూతనశకాన్ని సృష్టించిన అపూర్వసృష్టి ఇదే బాణీలో అచ్చమైన

గుంటూరుసీమ యాసలో కామిరెడ్డిపూడి కరణం తుమ్మూరి ఏకామ్రరాయకవి రచించిన రాజశేఖర శతకంలోని ఒక పద్యం మచ్చుకు అవధరించండి

'చెరు యవారమందున కలిగ్గములో మన మున్సుబంటి ఔ
దారము గల్లవోడు మొలతాడుకు గోసిటిగింది లేసినా
వారిని లచ్చిపెట్టడు మనూరికి దగ్గమొగోడు ఆడితో
పోరగలేడు కర్ణమని పొంగును మూఢుడు రాజశేఖరా!

దీనికి ప్రతిస్ఫూర్తిగా అవతరించిన కొసరాజు రాఘవయ్యగారి వీర శేఖర శతక రచన సైతం ఇదే పద్ధతిలో నడచింది

తెలుగునాట ఇంతకు పైగా సామెతలున్నాయని చిలుకూరివారి నిష్కర్ష ఏదో ఒక సామెత లేకుండేనిదే అచ్చమయిన తెలుగువారి సంభాషణ సాగదు కొన్ని సామెతలు ఎక్కువ ఉన్నట్టుగా కవుల రచనలకెక్కాయి కొన్ని సంస్కారం పొందిన కావ్యాలలో కనిపిస్తాయి కావ్య భాషలో ప్రయుక్తమైన కొన్ని నుడికారాలు, సామెతలు మాదిరికి చూడవచ్చు ఎడమ కుడి చేయులగక, ఎండకన్ను నీడకన్ను, పిల్లవసి పేరంటం, మెత్తని పులి, తేరవస్తే పులి కొండక పెద్ద తేవర. కుట్టినాని చేతిరాయి, ఆత్తనెత్తి జేతు లంగసిలో కన్నులు, ఎద్దు పెడిన గానుగ ఆదరునా, కలిసోసిన పెనుక నుప్తి గనుగొను మర్కిన్స్, కాలం దొడ్డగు పామకలు తలకెక్కె, కుంచెన్న కూడబెట్టగ మంచన మాయం చేసె, ఉట్టిదేలు కుట్టుకున్న కుమ్మరజాతి, గొర్పట్టు పమున్ గోతపిపోటు. పంటకాయలకుగాక గ్రక్కిళ్ళ కాణ్గలదె!, పిమ్మకగుంటమీద భాగీరథి వచ్చినట్లు, వెన్నకు ఇంద్రుడవచ్చు, పత్తి దీరెను లోకలి తలంట్లు - మొదలైనవి కొన్ని ఉదాహరణలు

పాదపునరుక్తి, పాదాది పదపునరుక్తి, పాదాంతపదపునరుక్తి జాన పద వాఙ్మయంలోని ఒక ముఖ్య లక్షణం పంపిణీదాధ్య చరిత్ర పర్వతా రోహణ ప్రకరణంలో -

'చేదుకో చేదుకో శ్రీగిరినాథ
చేదుకో మల్లయ్య చేదుకొమ్మనుచు
చేదుకో చేదుకో శ్రీశైల నిలయ
చేదుకో మల్లయ్య చేదు కొమ్మనుచు' పాటలు గట్టి పాడే భక్తగణం మనకు కనిపిస్తుంది

అనేకాంశాలలో [illegible] భద్రపరచిన బసవ పురాణంలో పాదపునరుక్తులు కొన్ని చూడండి

'బసవని శరణన్న పాపక్షయమ్ము
బసవని శరణన్న పరమపావనము
బసవని శరణన్న ప్రత్యక్ష సుఖము
బసవని శరణన్న భవరోగహరము' ఇలా 'బసవని శరణన్న' అన్న భాగం మరో పది అవృత్తులు ప్రవర్తిస్తాయి ఇక్కడ రెండు రెండు పాదాల కొకసారి పాదాది భాగాలు అంటే పునరుక్తమవడంలోని సొగసును చిత్తగించండి

'బాపురే కన్నప్ప! పరమలింగంబ
బాపురే కన్నప్ప! ప్రమథ విలాస
నల్లవో కన్నప్ప! నాటి గమ్యగ్ధ
నల్లవో కన్నప్ప! నల్లనైనార'

బసవ పురాణంలోని —

'శివరాత్రి నిత్యంబు చెల్లించు బాస
శివభక్తు లెల్లను శివుడను బాస ' ఇలా 'బాస' అన్న పాదాంతపదం సుమారు నలభై మాట్లు ప్రయోగించబడింది ఇలాటి పునరుక్తి పద్ధతి పోతన రచనలో పలుతావుల ప్రయోగించబడింది. మాను పిలుపుపై ధనుర్యాగం

నిమిత్తం బృందావనం నుంచి మధురకు వచ్చి అన్నతోపాటు నగరవీథులలో నడుస్తున్న కృష్ణుని చూచి మధురానగరంలోని పురంధ్రీమణులు –

'ఏ ద దే రక్కసి విగతజీవగ జన్ను
బాలు ద్రావిన మేటి బాలకుండు
ఏ ద దే నందుని వెలదికి జగమెల్ల
ముఖమందు జూపిన ముద్దులాడు ' అని తమలో తాము

చెప్పుకొన్న మాటలలో 'ఏ ద దే' అన్న పదం ప్రతి పాదానికి పునరావృత్తమయింది

'కొనసాగ దురితము లెక్కుడైన సుఖము
తను విచారములలో దాకొన్న సుఖము '

అన్న అన్నమాచార్య కీర్తనలోని 'సుఖము' అన్ని చరణాలలో పునరావృత్తం కావడం జానపద ముద్రకు మరొక తార్కాణ

తాళ్ళపాక తిరువెంగళనాథుడు రచించిన పరమయోగి విలాసకృతిలో శ్రీరంగనాథపరమైన ప్రబోధకీ స్తుతిలో 'పాలించి కరుణ చొప్పడ యోగ నిద్రం జాలించి, శ్రీరంగశాయి మేల్కొనవె' - అన్న ద్విపద పంక్తులు పదిసార్లు ఆవృత్తం కావడం కూడ ఈ ముద్రకు నిదర్శనం

ఇలా ఎంతని తవ్వితీయగలం, ఇది ఇసుక పాతర !

'దిగిరాను దిగిరాను దివినుండి భువికి' అని కవులెంత బెట్టుసరిచేసి విహాయస వీథులలో విహరించుటకు కూర్చుంటామన్నా, చిట్టచివరకు తమ మనుగడకు మూల భూమిక అయిన ఈ జానపద భూమికి దిగిరాక తప్పదు ఇది సహజమూ, అనివార్యమూ అయిన మానవ నైజం

Keywords: AcArya tUmATi doNappa gAri rachana, AkASa bhArati, SishTa sAhityam lO jAnapada mudra, telugu vyAsAm, AchArya toomATi doNappa, dwA.nA.SAstry, mAnava naijam, anivAryam, janAvAsAlu, palleTULLu, palleTUru, punarukti, pAdam, naga naTra, alavATlu, aaTa pATa, kaTTu kathalu, tiTlu, voTlu, oTlu, AlOcanalu gaTrA